క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



కొమరోలు : జేసీబీతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

కొమరోలు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామసమీపంలో స్థానిక ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో శనివారం పిచ్చిమొక్కలను తొలగించారు. అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిలోని బ్రాహ్మణపల్లె వద్ద రహదారికి ఇరువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లుగా గ్రహించిన ఎస్సై నాగరాజు జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్డీఎస్ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మల్లారెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లె, యర్రపల్లె, భావాపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

ఉపాధి కూలీలు ఈ-కేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ గురువరకుమార్

బేస్తవారిపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కార్డు కలిగిన ప్రతి వేతనదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్ అన్నారు. శనివారం మండలంలోని పిటికాయగుళ్లలో కూలీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకేవైసీ చేయించుకోని జాబ్‌కార్డులు ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్తారని, మస్టర్‌లోకి పేరు రాకపోవడంతో పని కల్పించలేమన్నారు. పంచాయతీ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, మేట్స్‌ను సంప్రదించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌లో ఆధార్ అనుసంధానం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీఏ రమేష్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



కొమరోలు : రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యం

కొమరోలు: గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సత్యం ఆదేశించారు. మండలంలోని రాజుపాలెం, ఇడమకల్లు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సత్యం శనివారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని, అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

దివ్యాంగునికి వీల్ చైర్ అందజేత



దివ్యాంగునికి వీల్‌చైర్ అందిస్తున్న సభ్యులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్యకాలనీలో నివాసముండే దివ్యాంగుడైన డొక్క చినబాబుకు శనివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వీల్ చైర్ అందించారు. అధ్యక్ష, కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము, కోశాధికారి తడికమళ్ల శ్రీనివాసులు, సభ్యులు పీవీ కృష్ణారావు, బచ్చు సుబ్రహ్మణ్యం, ఏ రామాంజనేయులు, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, జలీల్‌బాషా పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సేవా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆటోడ్రైవర్ల సేవా ర్యాలీని శనివారం సబ్ కలెక్టర్ త్రివినాగ్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆర్డీఓ చందన, తహసీల్దార్ చిరంజీవి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీ రోడ్డుపై లోతైన గుంతలతో మురికినీరు



దారుణంగా మారిన సీసీరోడ్డు

నీరు వృథా..బురదతో వ్యథ

బేస్తవారిపేట:

వృథాగా పోయే నీరు రెండు వీధులను మురికిమయంగా మార్చేస్తోంది. బేస్తవారిపేట మండలంలోని జేసీ అగ్రహారంలో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన సింగిల్‌ఫేజ్ మోటార్, సిమెంట్ రింగులతో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేశారు. నిత్యం చుట్టు పక్కల స్థానికులు నీటిని పట్టుకుంటున్నారు. వాటర్‌ట్యాంక్ నిండి నిత్యం నీరు వృథాగా పోతోంది. వృథా నీరు జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు, గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై చేరి నిల్వ ఉంటుంది. రోడ్డంతా లోతైన గుంతలమయంగా, మురికికూపంగా మారింది. దుర్వాసన వెదజల్లుతూ దారుణంగా మారింది. వృథా నీటిని అరికట్టడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారు. చిన్నపాటి సమస్యను పరిష్కరించలేక వీధులను మురికికూపాలుగా మార్చడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెంచికలపాడులో మెయిన్‌రోడ్డు దుస్థితి

పెంచికలపాడులో..

మండలంలోని పెంచికలపాడులో మెయిన్‌రోడ్డు చివర మురికికూపంగా మారింది. గృహాల నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై చేరుతోంది. నిత్యం నీరు నిల్వ ఉండటంతో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డంతా మురికిమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. పాఠశాల వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు.

కన్నులపండుగగా అమ్మవారి గ్రామోత్సవం



అమ్మవారి గ్రామోత్సవంలో డీఎస్పీ, సీఐ, ఎస్సైలు



గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు



గ్రామోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులు

కంభం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారిశాల వద్ద నుంచి గ్రామోత్సవంగా ప్రారంభమై జామియా మసీదు సెంటరు, చౌక్‌సెంటర్, రామాలయం వీధి, సాదుమియా వీధి, తెలుగు వీధి మీదుగా గ్రామోత్సవం సాగింది. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు, పాటకచేరీలు అలరించాయి. మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో సీఐ కె.మల్లిఖార్జున పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ట్రావెల్స్ బస్సుల దసరా దందా



ట్రావెల్స్ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



ఆన్‌లైన్ టికెట్ ధర చూపిస్తున్న ఓ ట్రావెల్స్ బస్సు

● పట్టించుకోని రోడ్డు రవాణాశాఖ

కొమరోలు: దసరా పండుగను సాకుగా చూపుతూ ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం ఇష్టానుసారంగా బస్సు చార్జీలు పెంచుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి సుదూర నగరాల్లో ఉన్న కొమరోలు మండలవాసులు దసరా పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వస్తూ, వెళ్తున్నారు. కొమరోలుకు సరైన ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం ఇష్టారీతిగా టికెట్ల ధరలను పెంచేస్తూ ప్రయాణికుల నుంచి దోచుకుంటున్నారు. కొమరోలు నుంచి బెంగళూరు, కొమరోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సుల్లో రూ.700 వరకు టికెట్ ఉండగా ట్రావెల్స్ బస్సుల్లో రూ.2 వేలకు పైగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దసరా సెలవుల అనంతరం శని, ఆదివారాలు హైదరాబాద్, బెంగళూరు నుంచి వచ్చిన ఉద్యోగులు తిరిగి ప్రయాణం అవుతున్న నేపథ్యంలో రూ.2 వేలకు పైగా టికెట్ ధరలను ట్రావెల్స్ బస్సులు వసూలు చేస్తున్నాయి. ట్రావెల్స్ బస్సుల్లో రెండు రెట్లు టికెట్ ధరలు పెంచుతున్నా ఆర్టీఓ అధికారులు ఇటువైపుగా కన్నెత్తి కూడా చూడడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకుని ట్రావెల్స్ బస్సుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వెలుగు ఉద్యోగులకు 5జీ ఫోన్లు ఇవ్వాలి

మార్కాపురం: వెలుగు ఉద్యోగులకు, వీఓఏలకు పాడైపోయిన మొబైళ్ల స్థానంలో 5జీ ఫోన్లు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం వెలుగు ఏపీయం పిచ్చయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ 2జీ ఫోన్లతో ఆన్‌లైన్ వర్క్ చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వీఓఏలపై పనిభారం తగ్గించాలని, పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని, కాలపరిమితి జీఓలను రద్దు చేయాలని కోరారు. వీఓఏలకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5జీ ఫోన్లు ఇచ్చేంత వరకూ ఆన్‌లైన్ వర్క్స్ నిలిపివేస్తామని తెలిపారు.



ఏపీఎం పిచ్చయ్యకు వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

కార్యక్రమంలో అనిత, రత్నకుమారి, రంజాన్‌బీ, గంగా భవానీ, కాశింబీ, స్వేత, దేవకుమారి, వలివా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

మార్కాపురం: భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో రీ సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పొలాలున్న రైతులందరినీ పిలిచి సమగ్రంగా రీ సర్వే చేయించాలని తహసీల్దార్ చిరంజీవికి సూచించారు. గ్రామ పూర్తి విస్తీర్ణం 1964 ఎకరాలని, మొత్తం సర్వే చేస్తున్నామని, రైతులందరూ హాజరుకావాలని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, పక్కన తహసీల్దార్ చిరంజీవి

రైతులు వారి దగ్గరున్న వివరాలతో సర్వే టీములకు సహకరించాలని సూచించారు.

అమ్మవారికి సబ్ కలెక్టర్ పూజలు



పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: మండలంలోని కుంట, కోలభీమునిపాడు గ్రామాల మధ్య ఉన్న ముద్దసానమ్మ గ్రామ దేవతకు శనివారం మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత సేవా ఫౌండేషన్ అధ్యక్షునిగా మునెయ్య

తర్లుపాడు: దళితసేవా ఫౌండేషన్ అధ్యక్షునిగా మండలంలోని కలుజువ్వలపాడుకు చెందిన బి.మునెయ్య ఎన్నికయ్యారు. తర్లుపాడులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు సీహెచ్ యలమందబాబు, జిల్లా అధ్యక్షుడు ఖాశింషా, అధికార ప్రతినిధి అనిల్, జిల్లా నాయకులు ప్రకాష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామివార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లను వెండి కిరీటాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట రామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

వాసవీమాతకు ఘనంగా నగరోత్సవం

మార్కాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి శనివారం రాత్రి ఘనంగా పులివాహనంపై నగరోత్సవం నిర్వహించారు. వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. రథాన్ని పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. స్థానిక రాజాజీవీధి, మెయిన్ బజారు, గాంధీ బజారు, నెహ్రూ బజారు, నాయుడువీధి, తేరు బజారు మీదుగా నగరోత్సవం జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.పుల్లారావు, కార్యదర్శి వి.సురేష్‌కుమార్, కోశాధికారి సీహెచ్ మాలకొండ చిన్న నరసింహారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో వాసవీమాత

లక్ష్మీచెన్నకేశవస్వామికి వైభవంగా కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి శాంతి కల్యాణాన్ని శనివారం స్థానిక ఆలయంలో స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిపి స్వామివారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



ఉభయ దేవేరులతో చెన్నకేశవస్వామి

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం



కొనకనమిట్లలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

కొనకనమిట్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వలన ప్రజలు, రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఏఓ ప్రకాష్‌రావు అన్నారు. శనివారం కొనకనమిట్లలో మండల అధికారులతో జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజలతో పాటు చిన్న, సన్నకారు రైతులకు మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని ఏఓ అన్నారు. జీఎస్టీ వలన వ్యవసాయ యంత్ర పరికరాలు 7 శాతం తక్కువ ధరలకు లభిస్తున్నాయన్నారు. నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువుల ధరలు రూ.10 నుంచి 20 శాతం వరకు తగ్గుతాయని అన్నారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్వహించారు.

అవగాహన సదస్సును జయప్రదం చేయాలి

దర్శి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై అవగాహన సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో సదస్సు ప్రచార కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. రమేష్ మాట్లాడుతూ నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు దర్శిలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు మాజీ శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పెద్ద ఎత్తున కూటమికి మద్దతు ఇచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా 12వ పీఆర్సీ అమలు కోసం డీఏలు, ఐఆర్‌ల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌లతో పని భారం పెరుగుతోందని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పోరాడుతోందన్నారు. సమాన పనికి సమాన వేతనం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని, జిల్లా మహాసభల్లో ఉద్యోగుల సమస్యలు చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు మాట్లాడుతూ జిల్లా మహాసభలు దర్శిలో మెదటిసారిగా జరుగుతున్నాయని, ప్రచారం, ఏర్పాట్లు కోసం వివిధ కమిటీలుగా ఏర్పడి కృషి చేస్తున్నాయని తెలిపారు. దర్శిలోని ప్రజాతంత్ర వాదులు, మేధావులు మహాసభల జయప్రదానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. రైతు సంఘ నాయకులు సందు వెంకటేశ్వరరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, నాయకులు ఉప్పు నారాయణ, సీహెచ్ ఆదినారాయణ, గర్నిపూడి జాన్‌సామ్యేల్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు